


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### తొక్కేం కాదూ?

"తొక్కలో వెధవ వాడినేవిటి కేర్ చేసేది?"

"నీకన్నీ తెలుసా? తొక్కేం కాదూ?

"ఏవుంది నా దగ్గర తొక్కా?"

ఇలా 'తొక్క' డైలాగులు తెలుగు సినిమా తెరనీ, జనజీవితంలోనూ కూడా సామాన్యమైపోయాయి. అసలు ఈ 'తొక్క' ఇంత చులకనగా ఎందుకు మారిందో పాపం! నిజానికి తొక్క అనేది చాలా విలువైనది. తొక్కలో రకరకాల ప్రొటీన్లూ విటమిన్లూ ఉన్నాయట. మా టీ.వీ.లో మంథని సత్యనారాయణ గారు తొక్క మాటలు చెప్పారో లేదో కానీ, తొక్కతో తింటే ఏ పండైనా మంచిదని నాకు చిన్నప్పుడే మా రాణీ టీచర్ చెప్పింది!

మా అమ్మమ్మ, వాణక్క ఉద్యోగ రీత్యా విజయవాడలో ఉన్నప్పుడు వారి ఇంటి ఓనర్ అయ్యంకి రమణయ్యగారి గురించి చెపుతూ, ఆయన సొరకాయ అవతల పారేసి తొక్క మాత్రం పచ్చడి చేసి పెట్టుకునే వారని చెప్పింది.

పండ్లలో, జామా, మామిడి, సపోటా తొక్కతో తినొచ్చు! బత్తాయీ అనాసా, పనసా కష్టం!

మా డైరెక్టర్ శివనాగేశ్వరరావు ఎవరైనా కథ చెప్పినప్పుడు అర్థం కాకపోతే "అరటి పండు వలిచి తొక్క నోట్లో పెట్టినట్లు చెప్పాడు" అంటుంటాడు. కానీ కొంతమంది అరటి పండుతో బాటు తొక్క కూడా తినడం ప్రాక్టీసు చేస్తారు.

అసలు ఈ తొక్కలన్నీ వదిలేస్తే, మన తొక్క తోటే కాదా అసలు ఈ 'రేసిజమ్'. మనుషుల్లో శ్వేతజాతీయులూ, నలుపు జాతివాళ్ళూ కొట్టుకు చచ్చిందీ.... ఈ తొక్క వల్లే! మన శరీరాన్ని కప్పే ఈ తొక్క... కోట్లు ఆర్జించి పెడుతుంది ప్లాస్టిక్ సర్జన్లకి!

ఈ రోజు ఈ తొక్క కబుర్లన్నీ ఎందుకు గుర్తొచ్చాయంటే, "అరటికాయ తొక్కతో కూర చేస్తానత్తయ్యా" అంది మా మేనకోడలు.

"అరటికాయ తొక్కతోనా?" అని బోలెడు ఆశ్చర్యపోయాను.

ఈ మధ్య అది ఇంటి పట్టునుండి మధ్యాహ్నం టీ.వీ ఛానెల్స్‌లో వచ్చే అన్ని వంటల ప్రోగ్రాములూ తెగ చూసేస్తోందట. నేనూ కొన్ని చూసాను. ఒకావిడ కాకరకాయలు నున్నగా చాకుతో బోడి చేసి, ఆ తర్వాత చింతపండు పులుసులో ఉడికించి, పుట్నాల పప్పూ,

కొబ్బరీ, పల్లీలూ, దాల్చిన చెక్కా, లవంగం, ఇలాచీ, జీలకర్ర, గసగసాలూ, అల్లం, వెల్లుల్లి, ఉల్లీ, కొత్తిమీరా, కరివేపాకూ.. ఇంకా మీ పోపుల పెట్టెలో, వంటగది డబ్బాల్లో ఉన్న సమస్త దినుసుల్నీ నూనెలో వేయించి, మిక్సీలో రుబ్బి ఈ బోడి కాకరకాయల పొట్టలు చీల్చి అందులో కూరి ఎర్రగా వేయించి, అందమైన గాజు బౌలులో పెట్టి, అటూ ఇటూ పచ్చి మిరపకాయలూ, చక్రాల్లా తరిగిన ఉల్లిపాయలూ పేర్చి... డైనింగ్ టేబుల్ మీద అందంగా పెట్టమంది. మరి తినాలో వద్దో చెప్పలేదు!

అదంతా చూసాక నాకు చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పిన కాకరకాయా, ఆనందరావూ కథ గుర్తొచ్చింది. ఆనందరావుకి కాకరకాయ వేపుడు అంటే చిన్నప్పటినుండీ చాలా ఇష్టమట! వారాలు చేసుకుని చదువుకున్న ఆనందరావుకి ఆ కూర ఏ ఇల్లాలూ చేసి పెట్టేది కాదట. చదువై, మంచి ఉద్యోగం సంపాదించుకున్న ఆనందరావు పెళ్ళి చేసుకుని, ఇక తన కోరిక తీరబోతున్నందన్న ఆనందంతో, కాకరకాయలు ఒక కిలో కొని పరమానందంగా భార్య కిచ్చి వండమని ఆఫీసుకెళ్ళాడట. మధ్యాహ్నం లంచ్ టైంలో ఇంటికొచ్చి భోజనం వడ్డిస్తున్న భార్య ఏవేవో వడ్డిస్తుండడం చూసి, "కాకరకాయ కూరేదీ?" అన్నాడుట.

"అదిగో!"అని విస్తరి చివర వేసిన నల్లని ముద్ద చూపించి "శుభ్రంగా ముళ్ళన్నీ తీసి, తొక్క కూడా తీసేసి వండానండీ" అందట.ఆనందరావు కరకర్లాడుతూ వేగిన కాకరకాయ కూర తలచుకుని భోరుమన్నాడుట - అదీ కథ! ఇలా కొన్ని కూరలకి తొక్కే రుచి! అడవి రాముడు సినిమాలో రాజబాబు  అన్ని రకాల కూరగాయలూ 'ఆల్ కూర్ చమ్ చమ్' అని తొక్కలతో పాటు వేసేసి, అటొచ్చిన కోడిని కూడా గిన్నెలో వేసి మూత పెడతాడు.

అమెరికాలో వెజిటేరియన్ ఫుడ్ అనగానే క్యాబేజీ తొక్కలూ, పెద్ద పెద్ద ఆకులూ, ఎర్రెర్రని చిన్న టొమేటా పండ్లూ, ప్లేట్‌లో అందంగా పెట్టుకునొచ్చి ఎంతో కష్టపడి నలభీమ పాకం చేసినట్లు ఫోజు ఇస్తాడు! ఇండియాలో అందరం వెజిటబుల్స్ అలాగే తింటాం అనే భ్రమలో ఉంటారా? లేక సలాడ్స్ వాళ్ళకి అంత ఇష్టమా... తెలుసుకోవాలి!

మనుషుల్లో కొంత మందికి పై మాటల్లో, మనసులో అసలు తేడా లేనట్లు క్యాబేజీ, ఉల్లిపాయాలాంటి వాటి తొక్కకీ, అసలుకీ తేడా ఉండదు! కొంతమంది మాట పెడసరంగా ఉన్నా మనసు వెన్నలా ఉన్నట్లే పనస పండులో తియ్యని తొనలూ, అనాసలో అంత తియ్యని రసం ఉంటాయి. ఈ మధ్య టీ.వీలో ఒకావిడ ఫ్రూట్ సలాడ్‌లో ఆపిల్ పండు కూడా తొక్క తీసి ముక్కలు కోసివేసింది. ఆపిల్ పండు తొక్క తియ్యడం ఎందుకో నాకు అర్థం కాలేదు... మా అన్నయ్య చెప్పాడు.. టీ.వీ.లో ఎక్కువసేపు కనపడ్డానికట!

చిన్నప్పుడు మా తెలుగు మాస్టారు "తొక్క తీసేస్తా పద్యం అప్పచెప్పకపోతే..." అనేవారు. ఆ మాటకే ఎంతో భయపడిపోయేవాళ్ళం! అన్ని పద్యాలూ కంఠతా పట్టేవాళ్ళం.

నా ఆప్తమిత్రుడొకడు అన్నింటికీ 'తొక్క' అంటాడు. చివరికి అతని పేరు తొక్క శీను అయి కూర్చుంది. ఈ తొక్క శీను కూడా మనం ఇందాక మాట్లాడుకున్న తొక్కలాగా చాలా ఇంపార్టెంట్ వ్యక్తి! ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా అన్ని పార్టీ ఆఫీసులూ కలతిరిగేసి పొట్టనిండా కబుర్లు నింపుకొచ్చి మనకి ఊదుతుంటాడు. ఇటు తెలుగు దేశం ఎమ్.ఎల్.ఏ గారి సతీమణి పెట్టిన బజ్జీలు తింటూ, "జీవితొదినా" అంటూ కాంగ్రెసు పార్టీ వాళ్ళతో మాట్లాడెయ్యగలడు. ఇటు ప్ర.రా.పా పార్టీ జెండా కారుకి పెట్టుకుని తిరగనూ గలడు. తొక్క శీను తలుచుకుంటే చెయ్యలేని పనీ, కలుసుకోలేని పెద్ద మనిషీ ఉండరు. "ఆ అదో లెఖ్ఖా - తొక్కా!" అంటూ ఏ పనైనా అవలీలగా ఆంజనేయుడిలా చేసేసే తొక్క శీను ఎక్కువగా సెక్రెటేరియట్‌లోనూ, కార్లోనూ దొరుకుతాడు. ఎప్పుడైనా ఒకసారి ఇంట్లో ఉంటాడు. రేపొద్దున్న ఎలక్షన్స్ అయి గవర్నమెంటు మారినా తొక్క శీను మాత్రం సెక్రటేరియట్లోనే ఉంటాడు. నాకు మాత్రం తమ్ముడితో సమానం. ఇలాంటి వాళ్ళు నా బోటి మధ్య తరగతి ఇల్లాలికి ఎంతో అవసరం. గ్యాస్ సిలిండర్ అయిపోయినా, కావలసిన వాళ్ళకి నిమ్స్‌లో బెడ్ అవసరమైనా, కారు డెలివరీ త్వరగా జరగాలన్నా తొక్కశీనుకి ఫోను కొట్టాల్సిందే ఇంక మన పక్కన తొక్క శీను ఉంటే అసలు మనకి "ఊ" కొట్టడమే కానీ మాట్లాడే పనిలేదు. ఎవరి ఇంట్లో ఎవడి పెళ్ళాం అట్లకాడతో మొగుడ్ని కొట్టిందీ, ఎవరి పెళ్ళానికి ఎవరు

ఆప్తమిత్రుడూ, ఏమినిస్టరమ్మ క్రైమా గారెలు బాగా వండుతుందీ? ఏ ప్రొడ్యూసర్ ఎంత పిసినారి వాడూ? ఏ హీరోయిన్ తల్లి పరమ లేకిదీ లాంటి విషయాలు, మనం పచ్చిపులుసులో నంజుకునే పొట్టూ వడియాల్లా కరకర్లాడుతూ చెపుతాడు. తొక్కశీను తను చేసే పనులకి పెద్దగా ఫీజులేవీ పుచ్చుకోడు. కానీ ఒక కిలో జీడిపప్పు పాకం ముందు పెడితే మనకి తెలీకుండా ప్లేటు ఖాళీ చేసి పెడతాడు!

జీడిపప్పు అంటే మళ్ళీ గుర్తొచ్చింది. పచ్చి జీడిపప్పు తొక్క తీసి కూర వండడం పెద్ద డెలికెసీ! మన తూర్పు సైడు ఈ మధ్య పెళ్ళిళ్ళల్లో ఈ కూర వండడం ప్రిస్టేజ్‌గా ఫీల్ అవుతున్నారు. పనసపొట్టు కూరలాగే ఇదీ ఆంధ్రా స్పెషల్ అయి కూర్చుంది. కానీ ఆ పచ్చి జీడిపప్పు తొక్క తియ్యడం ఆషామాషీ కాదు! సరిగ్గా తియ్యకపోతే మన తొక్క లేచిపోతుంది.

సో... ఈ రోజు మనం తొక్క యొక్క ప్రాముఖ్యత తెలుసుకున్నాం కాబట్టి, ఈ వ్యాసం చదివినవాళ్ళూ, అర్ధం చేసుకున్నవాళ్ళూ అంతా కూడా తొక్కతియ్యకుండా బీరా, సొరాలాంటి కూరగాయలతో పచ్చళ్ళు చేసుకుని తింటారనీ, వీలైతే అరటి పండుతో సహా కొన్ని పండని తొక్కతో తింటారని ఆశిస్తున్నాను. కానీ నేను ఇందాక చెప్పిన కమలా పండూ, బత్తాయి, నారింజా ఫ్యామిలీ జోలికి మాత్రం పోకండి. అసలే వాటికి కోపం ఎక్కువ! వలుస్తుంటేనే మన కళ్ళు మండిస్తుంటాయి.

ముక్తాయింపుగా ఒక సూక్తి! ‘తొక్క చేసిన మేలు అక్క కూడా చెయ్యదు!‘ ఎక్కడా వినలేదా? వినరు... నేనే సృష్టించాను. ఎవరూ సృష్టించకపోతే ఇలాంటివి ఎలా పుడతాయి చెప్పండి?....

"ఎవరక్కడా... వెయ్యండి వీరతాడు" అంటున్నారా!

